క్లుప్తంగా

వైభవంగా గ్రామోత్సవం



కలశాలతో గ్రామోత్సవం వెంట మాలధారులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయం నుంచి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆలయంలో అయ్యప్ప దీక్షాధారులు స్వామికి అభిషేకాలు, పూజ జరిపి అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని అలంకరించి ప్రత్యేకమైన వాహనంలో కొలువుదీర్చి పట్టణంలో ఊరేగించారు. ఇందులో భక్తులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు కల్పించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి చర్యలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఉర్దూ అధ్యాపకుడికి డాక్టరేట్



మహమ్మద్ ఫైజుల్లా

రాయచోటి (జగదాంబ సెంటర్) : రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉర్దూ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహమ్మద్ ఫైజుల్లా డాక్టరేట్ అవార్డు పొందాడు. ఈ మేరకు గురువారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఉర్దూ ప్రొఫెసర్ మహమ్మద్ అమీనుల్లా సారథ్యంలో ఉర్దూ నవలల్లో నార్సిసిజం అనే అంశంపై పరిశోధనలు చేసి సమర్పించినందుకు డాక్టరేట్ దక్కినట్లు తెలిపారు. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ హర్షలతా పంకజ్, వైస్ ప్రిన్సిపల్ మునియా నాయక్‌లతో పాటు ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

చెర్లోపల్లిలో వైద్య శిబిరం

పుల్లంపేట : మండల పరిధిలోని చెర్లోపల్లి హరిజనవాడలో గురువారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు అధికంగా ఉండటంతో పలువురికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గ్రామాలలో పారిశుద్ధ్యం పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. తదుపరి గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ కార్యక్రమంలో శరత్ చంద్రరాజు, ఏఎన్‌ఎంలు, ప్రజలు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఒంటిమిట్ట : మండల పరిధిలోని దర్జపల్లిలో ఉన్న ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రెండు గృహాలు కుప్పకూలిపోవడంతో బాధితులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ తెలిపారు. గురువారం గృహాలు కుప్పకూలిన విషయం తెలుసుకున్న తహసీల్దార్ రెవెన్యూ సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితులు నుంచి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు పరిస్థితిని నివేదించి సాయం అందేలా చూస్తామని తెలిపారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం ఎర్రగట్లవాండ్లపల్లెలో గురువారం జరిగిన వెంకట్రామిరెడ్డి సతీమణి యండపల్లి లక్ష్మీదేవమ్మ దశదిన కర్మకాండలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ దేవనాథరెడ్డి, సర్పంచ్ ముసల్‌రెడ్డి, రామాపురం వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి తదితరులు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

అయోడిన్ లోపంతో దుష్పరిణామాలు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

సిద్దవటం : అయోడిన్ లోపాల వల్ల కలిగే దుష్పరిణామాలను అందరూ తెలుసుకోవాలని డాక్టర్ లక్ష్మి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం అయోడిన్ రుగ్మతలపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల ఏర్పడే రుగ్మతలను విద్యార్థులకు తెలియజేశారు. అయోడిన్ విటమిన్ శరీరానికి చాలా అతి ముఖ్యమైన విటమిన్ అని అన్నారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వ్యాధి ప్రతి 100 మందిలో ఇద్దరు లేదా ముగ్గురు బారిన పడుతున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 అరుణ, పాఠశాల హెచ్‌ఎం శ్రీరాములు, సంస్థ సిబ్బంది, శ్రీనివాస్, జ్యోతి శివయ్య, మంజూవాని, రహమతున్నీసా, బాల సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- రాజంపేటను వేధిస్తున్న పందుల బెడద
- ప్రాణాంతకమైన వ్యాధులు వస్తాయంటున్న వైద్యులు
- అధికారులు చర్యలు చేపట్టాలంటున్న స్థానికులు



పట్టణంలో జనసంచార ప్రాంతంలో సంచరిస్తున్న పందులు

రాజంపేట టౌన్ : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రాజంపేట ప్రజలకు శాపంగా మారింది. దాదాపు మూడేళ్ల క్రితమే మున్సిపాలిటీ పరిధిలో పందులు అధికంగా ఉండేవి. పందుల వల్ల ప్రజలు ఎక్కడ వ్యాధుల బారీన పడతారోనని అప్పట్లో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పందుల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా జనసంచారం లేని ప్రాంతాలకు పందులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే పందుల పెంపకందారులు పందుల పెంపకానికి స్థలం చూపించాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో పందుల పెంపకానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన తరువాతే పట్టణంలో పందుల నివారణకు చర్యలు తీసుకోవాలని న్యాయస్థానం మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి అప్పటి సబ్‌కలెక్టర్ కేతన్‌గార్గ్‌ను కలిసి సమస్యను వివరించడంతోపాటు న్యాయస్థానం ఆదేశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి జనసంచారం లేని ప్రాంతంలో పందుల పెంపకందారులకు ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేసి కోరారు. అయితే కొంతకాలానికే సబ్‌కలెక్టర్ బదిలీ అయ్యారు. అనంతరం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారెడ్డికి కూడా మున్సిపల్ ఛైర్మన్ సమస్యను తెలియజేసి స్థలం కేటాయించాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో పట్టణంలో పందుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతూ వస్తోంది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని 29 వార్డుల్లో పందుల బెడద అధికంగా ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఇప్పుడు ప్రజలకు శాపంగా మారింది.

మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదం

పందులను కుట్టిన దోమలు మనుషులను కుడితే మెదడువాపు వ్యాధి వచ్చే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు. మెదడువాపు వ్యాధి వల్ల మనిషి చనిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు అంటున్నారు. పందులపై వాలిన దోమలు ఆహార పదార్థాలపై వాలి ఆ ఆహార పదార్థాలను తిన్నా మనిషి అనారోగ్యం బారీన పడే అవకాశముంటుంది. పందుల వల్ల అతిసార, ఊపిరితిత్తుల జబ్బులు వచ్చే ప్రమాదముందని వైద్యులు తెలియజేస్తున్నారు.

కలెక్టర్ స్పందిస్తేనే సమస్య పరిష్కారం

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి స్పందిస్తేనే రాజంపేట మున్సిపాలిటీలో పందుల బెడద సమస్య పరిష్కారం అవుతుందని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పందులను జనసంచారం లేని ప్రాంతాలకు తరలించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు పందుల పెంపకానికి జనసంచారం లేని ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాల్సివుందని, అందువల్ల జిల్లా కలెక్టర్ స్పందించి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తే వీలైనంత త్వరగా పందులు లేని పట్టణాన్ని చూడగలమని ప్రజలు అంటున్నారు.

పందుల బెడద లేకుండా చూడాలి



పట్టణంలో పందులు అధికమయ్యాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పందులు బురదనీటిలో పొర్లుతున్నాయి. బురదనీటిలో ఉండే దోమలు పందులను కుట్టి మనుషులను కుడితే ప్రాణాపాయమైన మెదడువాపు జబ్బు సోకే ప్రమాదముంది. ఎక్కడ పందులను కుట్టిన దోమలు చిన్నపిల్లలను కుడతాయో అని చిన్నపిల్లల తల్లిదండ్రులు భయపడుతున్నారు. అందువల్ల పట్టణంలో పందులు లేకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఏ.శంకర్‌రాజు, రిటైర్డ్ హెడ్‌మాస్టర్, రాజంపేట

13న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

రాజంపేట : ఈనెల 13న అరుణాచలానికి ప్రత్యేక బస్ సర్వీసును భక్తుల కోసం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రాజంపేట డిపో మేనేజరు గుండాల రమణయ్య గురువారం తెలిపారు. ఈ బస్సు 13వ తేదీ ఉదయం 6గంటలకు బయలుదేరుతుందన్నారు. కృత్తిక నక్షత్ర దీపం దర్శనానికి వెళ్లేవారికి ఉపయోగకరమన్నారు. ఆన్‌లైన్‌లో టూ వే రిజర్వేషన్ చేసుకోవచ్చుని పేర్కొన్నారు. వివరాలకు రాజంపేట ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్‌ను సంప్రదించాలన్నారు.

దివ్యాంగుల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలి

రామాపురం : సమాజంలో దివ్యాంగుల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని మండల విద్యాశాఖ అధికారి రామకృష్ణుడు అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. పల్లెలో నేటికి దివ్యాంగులపై చిన్న చూపు చూస్తుంటారని, తల్లిదండ్రులు బాగున్న పిల్లలను ఒక విధంగా దివ్యాంగ పిల్లలను మరోరకంగా చూస్తుంటారన్నారు. ఇలాంటి వాటిని దూరం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ-2 జయచంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాద్, భవిత కేంద్రం ఐఈఆర్‌టీలు, సిబ్బంది , పిల్లల తల్లిదండ్రులు, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.

ఫిర్యాదులను అదే రోజు పరిష్కరించాలి

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు



సుండుపల్లె : సదస్సుపై సూచనలు చేస్తున్న నోడల్ అధికారి జయరాముడు

సుండుపల్లె : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల ప్రత్యేక నోడల్ అధికారి జయరాముడు గురువారం గ్రామ రెవెన్యూ సదస్సులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉన్నటువంటి భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు జరుపుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏ రోజు వచ్చిన ఫిర్యాదులను అదే రోజే పరిష్కరించాలని వీఆర్‌ఓలకు సూచించారు. మండలంలోని ప్రజలందరూ ఈ గ్రామ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక కంప్యూటర్ టేబుల్ ఏర్పాటు చేసుకోవాలని, రైతులకు సంబంధించిన అన్ని రికార్డులను రెవెన్యూ సదస్సులకు తీసుకెళ్లాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, సబ్ రిజిస్ట్రర్ ఆఫీస్ సిబ్బంది, వీఆర్‌ఓలు వెంకటరమణ, బసయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

పుల్లంపేట : రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని పుల్లంపేట తహసీల్దార్ అరవింద కిషోర్ అన్నారు. 6వ తేదీ దళవాయిపల్లె గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామ రైతులు తమకు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

పాటూరులో నేడు..

నందలూరు : మండలంలో ఈనెల 6వ తేదీ నుంచి రెవెన్యూ గ్రామ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అమర్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ పాటూరు, 7, 10వ తేదీలలో నాగిరెడ్డిపల్లి, 11న నందలూరు, 12న ఆడపూరు, 13న నల్లతిమ్మయ్యగారిపల్లి, 17న ఎర్రచెరువుపల్లి, 18న లేబాక, 19న కుందానెల్లూరు, 20న టంగుటూరు, 21న లేబాక, 24న టంగుటూరు, 26న నూకినేనిపల్లి, 27న చింతలకుంట, 28న పొత్తపి, 31న ఎల్లంరాజుపల్లెల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట : ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8 వరకు జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి గురువారం పిలుపునిచ్చారు. రెవెన్యూ సదస్సులలో ప్రజల భూ సమస్యలు, సర్వే సమస్యలను పరిష్కరించేందుకు చక్కటి వేదిక అన్నారు. గ్రామ స్థాయిలో సదస్సులుంటాయన్నారు. డివిజన్ పరిధిలోని మండలాల్లోని గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు తప్పనసరిగా హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సంబంధించి వివిధ మండలాల వారీగా తేదీలను నిర్ణయించామన్నారు. సదస్సులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తెలియజేశారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో శుక్రవారం నుంచి 2025 జనవరి 8 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న గోపగుడిపల్లె, 7న కసిరెడ్డిగారిపల్లె, సూర్యనారాయణపురం, 10న రాచపల్లి, 13న నల్లగుట్టపల్లి, 17న సరస్వతిపల్లి, గువ్వలచెరువు, 21న పొత్తుకూరుపల్లె, 24న కల్పనాయినిచెరువు, 27న నీలకంఠ్రావుపేట, 2025 జనవరి 2న బండపల్లి, కుమ్మరపల్లె, 4న హసనాపురం, 7న సుద్దమళ్ల, 8న చిట్లూరు గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

సేంద్రియంతో నేలను రక్షించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలత

సంబేపల్లె : సేంద్రియ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తూ నేలలను రక్షించుకోవడమే కాక సారవంతంగా చేసుకుందామని ఏడీఏ శ్రీలత సూచించారు. గురువారం ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఏఓ కిషోర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతవరణ కాలుష్యంతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. కాలుష్యం నివారణకు సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. వర్మీ కంపోస్టు, పశుల ఎరువులు, పచ్చిరొట్టి ఎరువులు, ప్రకృతిలో దొరికే వివిధ రకాల ఆకులను పంటలు సాగు చేసే సమయంలో ఉపయోగిస్తూ భూమిని సారవంతం చేసుకోవాలన్నారు. అనంతరం రైతుల పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, జెడ్పీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యానందరెడ్డి పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఒంటిమిట్ట : కడప డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి తిరుమల పాదయాత్రలో భాగంగా గురువారం ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గోవింద మాల వేసుకున్న కడప డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి 22వ తిరుమల పాదయాత్ర సందర్భంగా కడప నుంచి తిరుమలకు పాదయాత్రగా వెళుతున్నారు. ఇందులో భాగంగా గురువారం ఒంటిమిట్టకు చేరుకున్న డిప్యూటీ మేయర్ పాదయాత్రకు ఒంటిమిట్ట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మాజీ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మేకపాటి నందకిషోర్ రెడ్డి, నిత్యానందరెడ్డి, సిగె భాస్కర్ రెడ్డి, తుమ్మలపెంట శ్రీనివాసులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నీటి మడుగుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



హెచ్చరిక బోర్డు వద్ద ఎస్‌ఐ, ఆలయ కమిటీ సభ్యులు

గాలివీడు : నీటి మడుగుల వద్దకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రామకష్ణ తెలిపారు. గురువారం మండలంలోని గండిమడుగు వద్ద నదీ పరివాహక ప్రాంతంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గండిమడుగు వద్ద ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉమామహేశ్వర స్వామి ఆలయం పక్కనే వెలిగల్లు జలాశయం ఉండటంతో ఇటు భక్తులు అటు పర్యాటకులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతూ ఉంటుందన్నారు. అనేక సందర్భాల్లో ఇక్కడికి వచ్చిన భక్తుల్లో చాలామంది నీటిలోకి దిగి లోతు తెలియక ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అక్కడికి వచ్చే భక్తులు, పర్యాటకులను అప్రమత్తం చేసేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రాయచోటి బ్రేక్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు గురువారం సీజ్ చేసి మండల పోలీసులకు అప్పగించినట్లు మండల ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలియజేశారు.

నేడు ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

రైల్వేకోడూరు అర్బన్ : రాజ్యాంగ నిర్మాత, దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరులోని పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అభిమానులు, దళిత నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కృతజ్ఞత సభను జయప్రదం చేయండి

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 10వ తేదీ విజయవాడలో జరగనున్న మాదిగల కృతజ్ఞత సభను జయప్రదం చేయాలని ఏపీఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిరేవుల రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంటలకు రాయచోటి టౌన్ ఎన్జీఓ ఆవరణలో చలో విజయవాడ కరపత్రాలను వారు ఆవిష్కరించారు. సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపేందుకు సభను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు తెలియజేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లిక

ఓబులవారిపల్లె : భూసార పరీక్షలు ఆధారంగా రైతులు పంటలను సాగు చేయాలని వ్యవసాయ అధికారిణి మల్లిక పేర్కొన్నారు. గురువారం చిన్నోరంపాడు రైతు భరోసా కేంద్రంలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రసాయన ఎరువుల వినియోగం ద్వారా భూమిసారం కోల్పోయి పంటలు దిగుబడి తగ్గడమే కాకుండా వైరస్‌బారిన పడి రైతులు నష్టపోతారన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూసారం పెరగడంతోపాటు రైతులు అధిక దిగుబడులు సాధించి ఆదాయం పొందవచ్చన్నారు.

అన్నదానం

రామాపురం : రాయచోటి ఎన్జీఓ కాలనీకి చెందిన ఫకీర్ సాబ్ కుమారుడు బాబాజీ సహకారంతో గురువారం బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయంలో అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సహాయాన్ని అందించారని లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ లయన్ షేక్ మహమ్మద్ పేర్కొన్నారు. క్లబ్ తరపున ఇలాంటి సేవ కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాన్ని అందిస్తానని ఆయన తెలియజేశారు.

దివ్యాంగ చిన్నారులు క్రమంగా పాఠశాలకు రావాలి



బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు

గాలివీడు : దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు పి.నాగరాజు, వి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు హాజరై మాట్లాడారు. దివ్యాంగ చిన్నారులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, విద్యా పథకాలు, పిల్లల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రభుత్వం అందించే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, ఎస్కార్ట్ లెవెల్స్, హోం బేస్డ్ అలవెన్స్, స్టైఫండ్ అలవెన్స్ ఫర్ గర్ల్స్ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకొని పాఠశాలకు క్రమం తప్పకుండా రావాలని సూచించారు. అలాగే సమగ్ర శిక్షా ద్వారా దివ్యాంగ పిల్లలకు సీపీ ఛైర్, వీల్ ఛైర్, వినికిడి యంత్రాలు వంటివి ఉపకరణాలు అందిస్తుందని వీటిని అవసరమైన వారికి తెలియజేయాలని తెలిపారు. అనంతరం పిల్లలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట చలపతి, ఐఈఆర్పీలు వి.ఖలందర్, టి.కృష్ణవేణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపాలి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : రైతుల రెవెన్యూ సమస్యలపై సిబ్బంది చొరవ చూపి పరిష్కారం దిశగా అడుగులు వేసేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులును లక్కిరెడ్డిపల్లి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్‌తో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాలలో రైతులకు సంబంధించిన భూ సమస్యలు, ఆన్‌లైన్ కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో రైతులు బ్యాంకుల్లో రుణాలు పొందడంతోపాటు ప్రభుత్వం సబ్సిడీ కింద అందజేస్తున్న సేద్యానికి సంబంధించిన పరికరాలు పొందడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వీటికి పరిష్కారం చూపే లాగా చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరి, ఆర్‌ఐ రాజేష్, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మల్ రెడ్డి, రాజబాబు, వీఆర్‌ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా జరపాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలో రెవెన్యూ సదస్సులను అధికార యంత్రాంగం పకడ్బందీగా నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో కోరారు. రెవెన్యూ సదస్సులను తూతూ మంత్రంగా కాకుండా సమస్యలను పరిష్కరించే విధంగా జరపాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఇప్పటికే కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. వాటిని అధికారులు గ్రామాలవారీగా విభజించి అక్కడ నిర్వహించే గ్రామసభల్లో వాటిని పరిష్కరించేందుకు చేసిన కృషిని వివరిస్తే ప్రజలు సంతృప్తి చెందుతారన్నారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందించే వినతిపత్రాలకు రశీదులు అందజేసేలా చూడాలని కోరారు. ఇదే సమయంలో పట్టణ ప్రాంతాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

ఆకేపాటి పాదయాత్రను విజయవంతం చేయండి

పుల్లంపేట : కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి కొలువైన తిరుమలకు అన్నమయ్య నడిచిన మార్గాన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి చేయనున్న 22వ పాదయాత్రను విజయవంతం చేయాలని పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కుమార్‌రెడ్డిలు కోరారు. ఈనెల 6న ఆకేపాటి ఎస్టేట్‌లో స్వామివారి కల్యాణం అనంతరం భారీ సంఖ్యలో భక్తులు గోవిందమాల ధరించి హరినామ స్మరణతో పాదయాత్ర ప్రారంభమవుతుందని, 6వ తేదీ సాయంత్రం ఊటుకూరుకు చేరుకొని 7వతేదీ ఉదయం అనంతయ్యగారిపల్లి, పుల్లంపేట మీదుగా అనంతంపల్లికి చేరుకుని అక్కడ ఉన్న జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం అల్పాహారం పూర్తి చేసుకుని తిరుమలకు పాదయాత్ర కొనసాగిస్తారన్నారు. మండలంలో గోవిందమాల ధరించిన భక్తులందరూ ఈ పాదయాత్రలో పాల్గొనాలని వారు కోరారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సిద్దవటం : మండలంలోని టక్కోలి రైతు సేవా కేంద్రంలో మాచుపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాల మామిడి రైతులకు పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన సదస్సును నిర్వహించామని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పూత సమయంలో నవంబర్, డిసెంబర్ మాసాలలో పాటించవలసిన చర్యలపై మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమ ఏర్పాటు చేశామని అన్నారు. మామిడిలో ఒక సారి పూత రావడం కోసం తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది వంశీ, శ్రీనాథ్ రైతులు పాల్గొన్నారు.

పెల్లుబికిన నిరసన

విద్యార్థుల దాడిలో కొత్తపల్లె జెడ్పీ హెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు ఏజాస్ అహమ్మద్ మృతి చెందిన సంఘటనను తీవ్ర ఖండిస్తూ మండలాల్లో ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు నిరసన తెలిపాయి. రాష్ట్రంలో అరాచకాలకు అంతేలేకుండా పోయిందని, భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులకే రక్షణ లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమను ఈ సంఘటన భయభ్రాంతులకు గురి చేసిందని, పాఠశాలలు కూడా పోలీసుల భద్రతలో నడపాల్సిన దుస్థితి వస్తుందేమోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు సమగ్ర విచారణ చేసి నిందితులను కఠిన శిక్ష పడేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో..



గాలివీడు: నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



పుల్లంపేట: నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



లక్కిరెడ్డిపల్లి: ఏజాస్ అహమ్మద్ మరణానికి కారకులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయులు



సుండుపల్లె: నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు



రాయచోటి అర్బన్: మాట్లాడుతున్న సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు